క్లుప్తంగా

ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయండి

సీఐటీయూ నాయకుడు బుస్స చంద్రయ్య



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

దుద్యాల్: మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు చేయాలని సిఐటీయూ నాయకుడు బుస్స చంద్రయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఉండాల్సిన కొన్ని కార్యాలయాలను ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే మండల సమీకృత భవనాలు, పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు పనులు జరుగుతుండగా, బ్యాంకు, ఇతర కార్యాలయాలు కూడా ఇక్కడే ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రాజు, లక్ష్మణ్, దేవి బాయి, కవిత, గోవింద్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: విద్యుత్ సరఫరాకు ఆదివారం అంతరాయం కలుగుతుందని ఏఈ హరిక్రిష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. కావున వినియోగదారులు ఈ విషయాన్ని గ్రహించి తమకు సహకరించాలని కోరారు.

రక్తదానం చేయండి



రక్తదానం చేస్తున్న యువకులు

దుద్యాల్: రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలుగా నిలవాలని కొడంగల్ ఓం శాంతి కేంద్ర నిర్వాహకురాలు పరిమల, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ పేర్కొన్నారు. శనివారం కొడంగల్ ఓం శాంతి కేంద్రంలో, రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 51 మంది రక్త దానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం డాక్టర్ శ్రీకర్, మధుసూదన్, కృష్ణవేణి, ఇతర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

తాండూరు రూరల్: మండల పరిధిలోని చంద్రవంచ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో గ్రామానికి చెందిన శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ యువజన సంఘం సభ్యులు మాట్లాడుతూ..మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉమాశంకర్ జన్మదినం సందర్భంగా పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సిములు, మల్లేశం, నరేశ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో శనివారం భాస్కరా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని కట్టమైసమ్మ దేవాలయం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు కంటి, దంత, ఎముకల వైద్య పరీక్షలు నిర్వహించారు. జనరల్ చెకప్‌తో పాటు బీపీ, షుగర్ పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా 150 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్యులు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ క్రాంతి, గ్రామ పెద్దలు, వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

మొయినాబాద్‌రూరల్: గోవింద నామస్మరణతో కనకమామిడి వేంకటేశ్వరస్వామి దేవాలయం మార్మోగింది. శనివారం మండల పరిధిలోని కనకమామిడి వేంకటేశ్వస్వామి దేవాలయంలో శ్రావణమాసం చివరి శనివారంతో పాటు పోలాల అమావాస్య సందర్భంగా స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి, వేదపండితులు, ఆలయ అర్చకుల మంత్రోచ్చరణల మధ్య సురంగల్ తాజా మాజీ సర్పంచ్ గడ్డం లావణ్యఅంజిరెడ్డి దంపతులు కూర్చొని ఈ ఉత్సవాన్ని జరిపించారు. అనంతరం స్వామివారికి నూతన వస్త్రాలు, పండ్లు, తలంబ్రాలు, పూలమాలలు సమర్పించారు. విచ్చేసిన భక్తులకు స్వామివారి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు

వరుస కుంభకోణాలు!

- టీజీబీల్లో రైతుల పేరిట అకౌంట్లు సృష్టించి నిధుల స్వాహా
- బంట్వారంలో రూ.12 లక్షలు
- తాండూరులో మహిళ దాచుకున్న ఫిక్స్‌డ్ డిపాజిట్ నుంచి రూ.6 లక్షలు
- వరుస ఘటనలతో బెంబేలెత్తుతోన్న ఖాతాదారులు
- ప్రధాన సూత్రధారులుగా బ్యాంకు ఉద్యోగులే
- కొనసాగుతున్న శాఖాపరమైన విచారణ



రస్నంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు

తాండూరు: తెలంగాణ గ్రామీణ బ్యాంకులు ఆర్థిక నేరాలకు వేదికగా మారింది. అక్కడి ఉద్యోగులే ప్రధాన సూత్రధారులుగా వ్యవహరించి నిధులను దోచుకుంటున్నారు. వికారాబాద్ జిల్లాలోని మూడు తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో ఇప్పటి వరకు జరిగిన కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి. నకిలీ పత్రాలను సృష్టించి రూ. కోట్లల్లో దోపిడీకి పాల్పడ్డారు. ఈ విషయంలో ఓ బ్యాంకు మేనేజర్‌ను సస్పెండ్ చేశారు. మరో బ్యాంకు మేనేజర్ నుంచి రికవరీ చేసి శాఖాపరమైన చర్యలు చేపట్టారు. ఈ నేరాల్లో మేనేజర్లతో పాటు సిబ్బంది పాత్ర కీలకంగా ఉండటం గమనార్హం.

రస్నం టీజీబీలో ..

యాలాల మండలం, రస్నం గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకును గ్రామీణ ప్రాంత రైతులకు సేవలందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండలంలో వారికి మాత్రమే రుణాలు మంజూరు చేయాలని నిబంధన. కానీ అధికారులు ఈజీ మనీ కోసం ఫోర్జరీ పత్రాలను సృష్టించి 2017–18 ఆర్థిక సంవత్సరంలో 151 మంది రైతుల పేరిట ఖాతాలు తెరచి పంట రుణాలను కాజేశారు. ప్రభుత్వం దశలవారీగా బ్యాంకు రుణాలు మాఫీ చేస్తుందనే ఉద్దేశంతో మోసాలకు తెరలేపారు. 2020, ఆగస్టులో రూ.1.47 కోట్లు కుంభకోణం జరిగినట్లు గుర్తించారు. ఈ వ్యవహారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో అప్పట్లో విధుల్లో ఉన్న సదరు బ్యాంకు మేనేజర్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. అంతటితో ఆగక బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూడు బ్యాంకుల్లో ఇలా..

రైతుల సంక్షేమం దృష్ట్యా రుణమాఫీ, సబ్సిడీ, రైతు బంధు, బీమా ఇలా ఎన్నో రకాల పథకాలు అమలు చేసింది. అయితే కొందరు అవినీతి అధికారులు పక్కదారి పట్టించి, రైతుల పేరిట నకిలీ ఖాతాల ద్వారా పంట రుణాలను డ్రా చేసుకున్నారు. రస్నంలో రూ.1.47 కోట్లు, బంట్వారంలోని టీజీబీలో 6 గురి పేరిట రూ.12 లక్షలు దోపిడీకి పాల్పడడంతో ఈ ఘటన వివరాలు వెలుగులోకి వచ్చాయి. తాజాగా తాండూరు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఓ మహిళ ఫిక్స్‌డ్ డిపాజిట్ నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రేమ్‌సింగ్ మరో ఇద్దరితో కలిసి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రూ.6.4లక్షలను డ్రా చేసుకున్నారు. పోలీసుల విచారణలో ప్రేమ్‌సింగ్ మరి కొన్ని ఖాతాలను కూడా ఫోర్జరీ చేసినట్లు విచారణలో ఒప్పుకున్నాడు. మూడు ఘటనల్లో ఓ బ్యాంకు మేనేజర్‌పై సస్పెన్షన్ వేటు పడగా, బంట్వారంలో జరిగిన ఆర్థిక నేరానికి సదరు మేనేజర్‌ను బాధ్యులుగా చేయడంతో రూ.12లక్షలు జమ చేశారు. మిగితా ఉద్యోగులపై శాఖాపరంగా విచారణ కొనసాగుతోంది.

ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు

ఎంపీడీఓ గ్యామా



బాస్‌పల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న గ్యామా

దోమ: ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో నిర్లక్ష్యం తగదని ఎంపీడీఓ గ్యామా పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని బాస్‌పల్లి గ్రామంలో లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం లబ్ధిదారులకు త్వరిత గతిన బిల్లులు చెల్లిస్తుందని, త్వరగా పూర్తి చేయించుకునేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. విడతల వారీగా బిల్లులు మంజూరవుతాయని, ఏ లబ్ధిదారుడు ఆందోళన చెందొద్దన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: బందెయ్య

బంట్వారం: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్కల బందెయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన కోట్‌పల్లిలోలబ్ధిదారుడికి ప్రొసీడింగ్ అందజేసి, ఇంటి నిర్మాణానికి ముగ్గు పోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులందరూ సకాలంలో ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు చిత్రశేఖర్, బాలయ్య, మాజీ ఉపసర్పంచ్ రియాజుద్దీన్, నాయకులు అహ్మద్ అలీ, ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

దేవనూరులో ఘనంగా సత్యసాయి గ్రామోత్సవం

యాలాల: మండలంలోని దేవనూరు గ్రామంలో సత్యసాయి గ్రామోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కిషన్‌రావు ఆధ్వర్యంలో సత్యసాయి గ్రామోత్సవాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం పల్లకీ సేవ అనంతరం స్థానిక పశువైద్యశాల సబ్ సెంటర్‌లో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సదానందం హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక గ్రామ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి శారదబాయి దేశ్‌ముఖ్, లలితాబాయి దేశ్‌ముఖ్‌ల తులాభారం నిర్వహించారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకుడు కిరణ్ దేశ్‌ముఖ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో బోర్డుపై రాత

మంత్రముగ్ధులను చేసిన గణితావధానం

యాలాల: మండలంలోని కోకట్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు అనంతప్ప నిర్వహించిన గణితావధానం చూపరులను మంత్రముగ్ధులను చేసింది. గౌతమి పాఠశాలలో కళ్లకు గంతలు కట్టుకొని, బోర్డుపై రాసిన పదాలను చదవడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఈ సందర్భంగా గణితావధాని అనంతప్ప మాట్లాడుతూ..కళ్లకు గంతలు కట్టుకొని రాసిన పదాలు గుర్తుంచుకొని చదివే కిటుకును పాటిస్తే గణిత సూత్రాలు గుర్తు పెట్టుకోవడంలో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. జ్ఞాపకశక్తిని పెంచుకునే విషయంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలన్నారు. ప్రతీ సబ్జెక్టును ఇష్టపడితేనే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. అనంతరం గౌతమి పాఠశాల ప్రిన్సిపాల్ కొండారెడ్డి మాట్లాడారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు అనంతప్ప ప్రదర్శన ఎంతో గొప్పగా ఉందన్నారు. పాఠశాల తరఫున సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించింది.

మండపాలకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ రఘురామ్

సీఐ రఘురామ్

ధారూరు: గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరని ధారూరు సర్కిల్ సీఐ రఘురామ్ పేర్కొన్నారు. ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శనివారం ఆయన ధారూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో అన్ని పార్టీల నాయకులు, గణేశ్ నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని, మసీదులు, చర్చిలకు కాస్త దూరంగా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, కమిటీ సభ్యు లు విధిగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ రాఘవేందర్, గణేశ్ నిర్వాహకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

దోమ: గణపతి మండపాల నిర్వాహకులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ వసంత్ జాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేయాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే ప్రాంతాల్లో ఏర్పాటు చేయొద్దని సూచించారు. డీజేలకు అనుమతులు లేవని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్



మట్టి గణపతిని పంపిణీ చేస్తున్న శుభప్రద పటేల్

అనంతగిరి: పర్యావరణ పరిరక్షణే ధ్యేయమని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ పేర్కొన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని ఎన్ఎస్పీ కార్యాలయంలో విత్తన గణపతి విగ్రహాలను జడ్పీ మాజీ వైస్ చైర్ పర్సన్ విజయ్ కుమార్, వీడీడీఎఫ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం విత్తన గణపతిని పూజించాలన్నారు. ప్రతిఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కిరణ్ పటేల్, సురేష్ గౌడ్, నాయకులు దత్తు సురేశ్, లెక్చరర్స్ ప్రెసిడెంట్ తిరుపతి రెడ్డి, అడ్వకేట్ జగన్, చైతన్య నాయకులు మారుతి, సుజీత్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆశాజ్యోతి సురవరం

దుద్యాల్: పేదల కోసం, కార్మిక, కర్షకుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు సురవరం సుధాకర్ రెడ్డి మృతి బాధాకరమని సీపీఐ నియోజకవర్గ నాయకుడు గంటి సురేశ్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం కొడంగల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సురవరం సుధాకర్ రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు పేదల సంక్షేమమే లక్ష్యంగా ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేసుకున్నారు. సావిత్రమ్మ, హకీమ్, లాలయ్య, హఫీజ్, షాకీర్, అంజమ్మ, ఆశమ్మ, అశోక్, నర్సిములు, రాజు నాయక్, భీములు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పారిశుద్ధ్యం మెరుగు పరచాలి

- బీజేపీ నాయకులు
- మున్సిపల్ కమిషనర్‌కు వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: రానున్న వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని గణేశ్ మంటపాల వద్ద పారిశుద్ధ్యం మెరుగు పరచాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం పట్టణ మున్సిపల్ కమిషనర్ యాదిగిరికి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వినాయక ఉత్సవాలు త్వరలో ప్రారంభం కానున్నందున అన్నీ వార్డుల్లో వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాల్వల శుభ్రత, చెత్త, చెదారం తొలగింపు పనులను నిత్యం చేపట్టాలన్నారు. వార్డుల్లోని ఆయా వీధుల్లో రోడ్లపై అనేక గుంతలు ఉన్నాయని, వాటిని పూడ్చివేయించాలన్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నూతన బాధ్యతలు స్వీకరించిన కమిషనర్‌ను శాలువా కప్పి సన్మానించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశం, లలిత, బాలప్ప, భద్రేశ్వర్, సురేశ్, కృష్ణ, ప్రహ్లాద్, కిరణ్, రాజు, బిచ్చప్ప వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

ముగిసిన శ్రావణమాస పూజలు



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

జినుగుర్తి ఆంజనేయస్వామికి పల్లకీసేవ

తాండూరు రూరల్: శ్రావణమాస ముగింపు సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. తాండూరు మండలం జినుగుర్తి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద నెల రోజుల నుంచి పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. చివరి శనివారం గో రక్షణ కమిటీ, భజన మండలి ఆధ్వర్యంలో పల్లకీసేవ చేపట్టారు. గ్రామానికి చెందిన పి.రాములు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, కిషోర్, నాగప్ప, మల్లప్ప, రాంచందర్, రాములు, యువకులు పాల్గొన్నారు.

తైలాభిషేకంతో తరించిన శనైశ్చరుడు

మోమిన్‌పేట: శ్రావణమాసం శని అమావాస్య కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శనైశ్చర స్వామికి తైలాభిషేకంతో తరింప చేశారు. మండల పరిధిలోని ఏన్కతల గ్రామంలో వెలసిన శనైశ్చర స్వామిని దర్శించుకునేందుకు ఉదయం 6గంటల నుంచే భక్తులు క్యూ కట్టారు. స్వామి వారికి అత్యంత ప్రీతి పాత్రమైన నల్లని దుస్తులు, నువ్వుల నూనెతో అభిషేకం చేస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా సప్తవృక్షాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నర్మదా మాతను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.



మోమిన్‌పేట: ఏన్కతలలో శనైశ్చరుని దర్శనానికి బారులు తీరిన భక్తులు

మర్పల్లిలో..

మర్పల్లి: బిల్‌కల్ సత్యనారాయణ మందిరం, మర్పల్లి సంఘమేశ్వర, పెద్దాపూర్ వేంకటేశ్వర ఆలయం, పట్లూర్ హనుమాన్‌మందిరంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. ఆయా దేవాలయాల వద్ద కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు, అన్నదానం చేపట్టారు. సత్యనారాయణ మందిరం నిర్మాణ దాత, హైకోర్టు రిటైర్డు జడ్జీ మోటూరి వెంకట దుర్గాప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

కొడంగల్ రూరల్: పెద్ద నందిగామా, గుండ్లకుంట గ్రామాల్లో శ్రావణ మాస ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ఊరేగింపు, అన్నదానం నిర్వహించారు.

ఎరువుల కొరతపై తహసీల్దార్‌కు వినతి

బంట్వారం: బీఆర్ఎస్ నాయకులు శనివారం బంట్వారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు ఎరువుల కొరత గురించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా, డీఏపీ అందుబాటులో ఉంచి పంపిణీ చేయాలని కోరారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

'పాత కార్యదర్శి బెదిరిస్తున్నాడు'

ధారూరు: నాలుగు రోజుల క్రితం మరో మండలానికి బదిలీ అయిన గట్టెపల్లి గ్రామ కార్యదర్శి అశోక్ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌ను బెదిరిస్తున్నాడని స్థానికులు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమేశ్‌కృష్ణ శనివారం ఎంపీడీఓ నర్సింలుకు ఫిర్యాదు చేశారు. తాను గట్టెపల్లిలో ఉన్నా, లేకపోయినా ట్రాక్టర్‌ను బయటకు తీయొద్దని డ్రైవర్‌ను బెదిరిస్తున్నాడని తెలిపారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవిషయమై ఎంపీడీఓ మాట్లాడుతూ.. అశోక్‌ను బషీరాబాద్ మండలానికి బదిలీ చేశారని, ఆయన మాటను వినాల్సిన పనిలేదని డ్రైవర్‌కు సూచించారు. మరోసారి బెదిరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

సీపీఎస్ రద్దుకు నిరసన



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల ధర్నా

బొంరాస్‌పేట: మండలంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు సీపీఎస్ రద్దును నిరసిస్తూ శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరుతూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శిరీషకు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆర్ఐ ప్రభుత్వ ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ, పంచాయతీరాజ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం పునఃరుద్ధరించాలి

ధారూరు: పాత పెన్షన్ విధానం పునఃరుద్ధరించాలని కోరుతూ టీయూపీఎస్ ఉపాధ్యాయసంఘం శనివారం ధారూరు తహసీల్దార్ సాజిదాబేగంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలు అధికారంలో ఉన్నప్పటికీ సీపీఎస్ రద్దు చేయలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు చేయకుండా తమను ఇబ్బందులకు గురిచేసిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం 100 రోజుల్లో రద్దు చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సంఘం అధ్యక్షుడు ఎల్. రాజు, ప్రధాన కార్యదర్శి బాలరాజ్, ఉపాధ్యాయులు అంజిరెడ్డి, వెంకటయ్య, శ్రీనినివాస్, శ్రీకాంత్, సాయికుమార్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి


కుల్కచర్ల: పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు. కుల్కచర్ల తహసీల్దార్ కార్యాలయంలో మనోహర్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దీర్ఘకాలికంగా పెండింగ్‌లోని సమస్యలను పరిష్కరించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఐ రవి, తపస్ నేతలు, తదితరులు పాల్గొన్నారు.



ధారూరు: తహసీల్దార్ సాజిదాబేగంకు వినతి పత్రం అందజేస్తున్న టీయూపీఎస్ నాయకులు

మర్పల్లిలో..

మర్పల్లి: ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని తపస్ మండల అధ్యక్షుడు అల్లిపూరం కేశవులు ప్రభుత్వానికి డిమాండ్ చేశాడు. సీపీఎస్ విధానాన్ని తీసుకొచ్చిన జీఓ 28 అమలు చేసిన రోజును పురస్కరించుకుని బ్లాక్‌డేగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ పరుశురామ్‌కు వినతి పత్రం అందజేశారు.



కుల్కచర్ల: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న తపస్ నేతలు